క్లుప్తంగా

తెగుళ్ల పరిశీలన

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపై వ్యాపించిన తెగుళ్లను సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీరో టిలేజ్ (దుక్కుదున్నకుండా) విధానంలో విత్తనాలు నాటడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. పంటల సాగు చేసే ముందు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ-ఏ కాలనీలో సన్ డిగ్రీ, పీజీ కళాశాలలో 400 మంది విద్యార్థులకు శనివారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ ధ్యానం చేస్తే కలిగే లాభాలను పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ప్రతినిధులు వివరించారు. ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు క్రింద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాశరావు, శివ, బిందుమాధవి, ప్రిన్సిపల్ వి.జయరాం, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

'వెలమలను బీసీ-ఏ జాబితాలోకి మార్చాలి'

శ్రీకాకుళం: వెలమలను బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెలమల్లో అధిక శాతం మంది రోజు కూలీలు, వలస కూలీలుగా అతి పేదరిక జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు.

పరామర్శ


అప్పలనాయుడును పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: కోటపాలెం పంచాయతీ పరిధి వై.లంకపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లంక అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శనివారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో నాయకులు లంక అసిరినాయుడు, బోంతు అసిరినాయుడు, లంక రాజు, మండాది రాము ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు తీర్మానం


మాట్లాడుతున్న సర్పంచ్ తమ్మిన మౌనికారాణి

గార: కళింగపట్నం ప్రధాన రోడ్డులో కాలువలపై ఆక్రమణలు చేపట్టడం వల్లే రోడ్డుపైకి మురుగునీరు వస్తోందని సర్పంచ్ తమ్మిన మౌనికారాణి అన్నారు. శనివారం సచివాలయంలో జరిగిన గ్రామసభలో మురుగునీరు ఇబ్బందులపై చర్చించి కాలువలపై ఆక్రమణలు తొలగించాలని తీర్మానించారు. పంచాయతీ కార్యదర్శి తరచూ సెలవు పెడుతుండటంపై దృష్టి సారించలేకపోతున్నామని, ఆక్రమణదారులకు నోటీసులివ్వాలని ప్రతిపాదించారు. సమావేశంలో ఎంపీటీసీ కిలుగు అప్పలనాయుడు, తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా ప్రచురించాలి


మాట్లాడుతున్న దిలీప్‌చక్రవర్తి

లావేరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలు ప్రచురించాలని తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి అన్నారు. లావేరులోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రచురణ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం గురించి వివరించారు. 2023 ఏడాదికి సంబంధించి ఓటర్ల జాబితా పబ్లికేషన్ పూర్తయిందన్నారు. ఆ జాబితాలను బీఎల్‌వోలు తీసుకొని వెళ్లి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రచురణ చేసి అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉండే వ్యక్తులు మరణిస్తే వారిని జాబితా నుంచి తొలగించాలన్నారు. మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేస్తే వాటిని స్వీకరించాలన్నారు. ప్రతీ ఓటరుకార్డుకు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయాలన్నారు. బీఎల్‌వోలు బాధ్యతతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ జి.రత్నకుమార్, ఆర్ఐ రామచంద్రరరావు ఉన్నారు.

చిలకపాలెంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: చిలకపాలెం గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను కార్మికులతో తొలగించారు. వీధుల్లో చెత్తాచెదారాలను తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ప్రజలతో మమేకమవుతూ..

సంక్షేమాన్ని వివరిస్తూ..

- వెంకయ్యపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


వెంకయ్యపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రజలతో మమేకమవుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జగన్నాథవలస సచివాలయం పరిధి వెంకయ్యపేట పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సుమారు రెండు వందల ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మూడున్నరేళ్ల పాలనలో చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివన్నా రు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేరువ చేస్తున్న ఘనత వైఎస్సా ర్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మావిడి ధనలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈలు కె.తిరుపతిరావు, బగాది భాగ్యలక్ష్మి, ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి పతివాడ భవాని, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండలబూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, మండల వ్యవసాయశాఖ సలహామండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, మావిడి శ్రీనివాసరావు, దేవిశెట్టి వెంకటేశ్వరరావు, కనకం తిరుపతిరావు, బత్తుల దిలీప్, దేవిశెట్టి రాము, సర్పంచ్‌లు భూపతి సురేష్‌కుమార్, చిత్తిరి మోహన్, తొత్తడి రామారావు, బాలి రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


పెదలింగాలవలసలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అనూరాధ

లావేరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి అనూరాధ అన్నారు. పెదలింగాలవలస, గోవిందపురం గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ఇసుక, సిమెంటు, ఐరన్‌తో పాటు నిర్మాణ సామాగ్రిని ప్రభుత్వమే సమకూర్చుతోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరు చేస్తున్నందున నిర్మాణాలను వేగవంతం చేయాలనన్నారు. ఆమె వెంట ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలావు అప్పలనాయుడు, హౌసింగ్ మండల ఏఈ కె.అప్పలనాయుడు, వర్కు ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు, పీఆర్ మండల ఏఈ ఎల్.అప్పన్న, గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శటికం రాంబాబు, నాయకులు మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్ ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రణస్థలం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు పని చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు అన్నారు. వెల్పురాయి గ్రామ సచివాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాని అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఎవరైన ఉండిపోతే నేరుగా మండల స్థాయి అధికారులను సంప్రదించవచ్చునన్నారు. తొలుత సచివాలయంలోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల జాబితాను అందరికీ కనిపించేలా ఉంచాలని సూచించారు. తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపీడీవో వి.ధనుంజయరావు, వెల్పురాయి వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల రామకృష్ణ, జి.ప్రసాద్ ఉన్నారు.

మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


ఉపాధ్యాయినులకు బహుమతులు అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

రణస్థలం: మహిళా విద్య కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త, స్త్రీ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయినులకు బహుమతులు అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు దిక్సూచి, ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీవో వి.ధనుంజయరావు, ఎంఈవో ఎ.త్రినాథరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్, జిల్లా సహాయ అధ్యక్షులు ధనలక్ష్మి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గిరిధర్‌రావు, ఎస్.నారాయణరావు, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు డి.కోటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కోదండరామయ్య, శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23 ద్విచక్ర వాహనాలకు జరిమానా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని జీటీ రోడ్డులో సెంటర్ పార్కింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేసిన వారికి ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. వివిధ షాపింగ్ కాంప్లెక్సులకు 23 ద్విచక్ర వాహనాలకు ఫైన్ వేయగా అపరాధ రుసుం కట్టిన విడిచిపెట్టి మిగిలిన వాటిని స్టేషన్‌కు తరలించారు. సంక్రాంతి నేపథ్యంలో సామాన్య కొనుగోలుదారులు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా దుకాణాల సముదాయం వారు సెంటర్ పార్కింగ్ విడిచిపెట్టి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

క్రమ పద్ధతిలో వరినాట్లు వేయాలి


వరినాట్లు వేస్తున్న మహిళలు

ఎచ్చెర్ల క్యాంపస్: క్రమ పద్ధతిలో వరినాట్లు వేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి సూచించారు. భగీరథపురం పంచాయతీ పరిధి ఓలేటి అగ్రహారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో రబీ వరినట్లు వేసే విధానాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. సంప్రదాయ పద్ధతిలో కాకుండా వరుస క్రమంలో నాట్లు వేయాలన్నారు. ఈ పద్ధతి వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి, నాట్లు బలంగా ఉంటాయని, తెగుళ్ల తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. దుబ్బు బాగా వేసి ధాన్యం దిగుబడి అధికంగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో పోలింగ్ బూత్‌ల వద్ద ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఓటరు ఓటు హక్కు కార్డుతో పాటు ఆధార్‌కార్డును తీసుకెళ్లి అనుసంధానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

శాసన మండలి చైర్మన్‌ను కలిసిన నాయకులు


మోషేనురాజుతో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్య మోషేనురాజును వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపాడు వద్ద దుశ్శాలువతో సత్కరించారు. ఆయనతో పాటు మెరక సూర్యనారాయణ, కొమ్ము గురువులు, సత్యం, నల్లబారికి శ్రీను, రంగాజీదేవ్ ఉన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన


లేఅవుట్ వద్ద సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం సందర్శించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఆరా తీశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈయనతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

'ఆశ్రా' సేవలు అభినందనీయం


గుర్తింపుపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థ ఆశ్రా సేవలు అభినందనీయమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆశ్రా సంస్థకు వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగస్వామ్యం చేస్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణకుమార్ జారీ చేసిన గుర్తింపుపత్రాన్ని ఆశ్రా శ్రీకాకుళం అధ్యక్షుడు డాక్టర్ గంజి ఎజ్రాకు శనివారం కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజనుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సరైన అవగాహన లేకపోవడంతో నిరక్షరాస్యులు మోసాలకు గురవుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తం చేస్తూ అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రా ఉపాధ్యక్షుడు గేదెల ఇందిరాప్రసాద్, ప్రతినిధులు ఎల్.రవికుమార్, గజపతిరావు, శాసపు జోగినాయుడు, డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, వారాడ రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించి పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాలను కాపాడటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ సమీపంలో బాదుర్లపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి శనివారం మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రావాడ జోగినాయుడు, పాపారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

2,192 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు


లావేరు-1 ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలిస్తున్న మహేష్‌నాయుడు

లావేరు: మండలంలో ఇప్పటివరకూ 2,192 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిందని మండల వ్యవసాయాధికారి డి.మహేష్‌నాయుడు అన్నారు. వెంకటాపురం, లావేరు–1, గోవిందపురం, పెదలింగాలవలస గ్రామాల్లోని ఆర్‌బీకేలను శనివారం మండల వ్యవసాయాధికారి సందర్శించారు. ఆయా కేంద్రాల ఆధ్వర్యంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. 23 రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో ఇప్పటివరకూ 663 మంది రైతుల వద్ద నుంచి 2,192 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించామన్నారు. కొనుగోలు చేసిన 21 రోజులకే రైతు బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులకు భారం లేకుండా ప్రభుత్వమే గోనె సంచులు సమకూర్చడం, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు భరిస్తున్నట్టు చెప్పారు. మండలంలో ఇప్పటివరకూ 4 కోట్ల 47 లక్షల 29 వేల 24 రుపాయల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ధాన్యం విక్రయ సమయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆర్‌బీకేల వీహెచ్‌ఏ, వీఏఏలు పి.గిరిజ, పద్మావతి ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న వెంకన్న స్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలో ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరుగాంచిన నారాయణ తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధనుర్మాస విశేషాలతో గోదాదేవి పాశురాలను వినిపించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

10న వెంకన్న హుండీల లెక్కింపు

శ్రీకాకుళ ం కల్చరల్: నారాయణ తిరుమలలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల ఆదాయాన్ని ఈ నెల 10న లెక్కించనున్నట్లు ఈఓ పి.శ్యామలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కిస్తామని పేర్కొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల వేంకటేశ్వర ఆలయంలో శనివారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. ఎచ్చెర్ల భజన బృందం సభ్యులు గోవిందనామాలు, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట ప్రదర్శన


తోలుబొమ్మలాట ప్రదర్శన


కళాకారులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళా మందిర్‌లో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేటకు చెందిన వనపర్తి వెంకటికుమార్, తోట దవీద్‌ల తోలుబొమ్మలాట ప్రదర్శన ఆకట్టుకుంది. 'సుందరాకాండ'లో సన్నివేశాలను చక్కగా వివరించారు. అంతకుముందు జరిగిన సభలో జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎస్.నారాయణరావు మాట్లాడుతూ తోలుబొమ్మలాట ప్రాచీన జానపద కళారూపమని, సినిమాలు లేనికాలంలో వీటికి ఎంతో ప్రాధాన్యత ఉండేదని గుర్తు చేశారు. కళలను పోషించడం గొప్పవిషయమన్నారు. అనంతరం పేద కళాకారులకు మూకల్ల తాతబాబు, అంబటి శ్రీనివసరావుల ఆర్థిక సహకారంతో నెలవారీ పింఛన్లు అందజేశారు. సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, బి.ఎ.మోహనరావుల సహకారంతో కళాకారులకు పండగ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మూకల్ల తాతబాబు, మందుల మోహనరావు, సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి రామచంద్రదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు


పాతఫారెస్ట్ కార్యాలయం రోడ్డులో నూతనంగా నిర్మించిన కాలువ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరంలోని హడ్కోకాలనీ, పాత ఫారెస్ట్ కార్యాలయం రోడ్డుతో పాటు నగరంలో పలు కాలనీల్లో కాలువలు, సీసీ రోడల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు, కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు చొరవతో అన్ని వీధుల్లో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలకు వెంటవెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.